ఎవరికి వారే..!

- పోటాపోటీగా ఎన్టీఆర్ వర్ధంతి
- ఎటువైపు వెళ్లాలో తెలియక అయోమయంలో కార్యకర్తలు



టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గీత, ఆమె వర్గీయులు



కోట కూడలిలోఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, ఆయన కుమార్తె అతిథి గజపతిరాజు

విజయనగరం రూరల్: టీడీపీ వ్యవస్థాక అధ్యక్షుడు ఎన్టీ రామారావు వర్ధంతిని ఆ పార్టీ నాయకులు గురువారం పోటాపోటీగా నిర్వహించారు. దీంతో ఆ పార్టీలో ఉన్న విభేదాలు మరోసారి బయట కువచ్చాయి. కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు పి.అశోక్‌గజపతిరాజు, నియోజక వర్గ ఇన్‌చార్జ్, అశోక్‌గజపతిరాజు కుమార్తె అతిధి గజపతిరాజు ఆధ్వర్యంలో కోట జంక్షన్, మున్సిపల్ కార్యాలయం జంక్షన్, కలెక్టరేట్ కూడళ్ల వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోట జంక్షన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ, తెలుగుజాతి, తెలుగు రాష్ట్రం అభివృద్ధికి గుర్తింపు తీసుకువచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఐవీపీ రాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గీత ఆధ్వర్యంలో...

విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సైలాడ త్రినాథరావు, జెడ్పీటీసీ సభ్యుడు తుంపిల్లి రమణ పాల్గొన్నారు.

కార్యకర్తల డైలామా

టీడీపీలో గ్రూపు రాజకీయాల కారణంగా తెలుగు తమ్ముళ్లు ఎటూ పాలుపోని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మాజీ మంత్రి వర్గం ఒక వైపు, బలమైన సామాజిక వర్గం అధికంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వర్గం మరో వైపు పోటా పోటీ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే కుదేలైన పార్టీని మరింత భ్రష్టు పట్టిస్తున్నారని తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కేవలం 'అతిధి' రాజకీయాలు చేయడానికి వచ్చే వారికి పెద్దపీట వేస్తూ, బలమైన సామాజికవర్గం ఓట్లు కలిగిఉన్న నేతను తొక్కేయడానికి ప్రయత్నించడం సబబు కాదని పలువురు మండిపడుతున్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సంఘ సభ్యులు

విజయనగరం: నగరంలోని అయ్యన్నపేట చెంచులకాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలకు మదర్ థెరీసా సేవా సంఘ సభ్యులు తమ వంతు చేయూతనందించారు. ప్రమాదంలో ఆరు ఇళ్లు పూర్తిగా దగ్ధం కాగా... ఆయా కుటుంబాలకు వారం రోజులకు సరిపడా పది రకాల నిత్యావసర వస్తువులు, దుస్తులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు త్యాడ ప్రసాద్ పట్నాయక్, కార్యదర్శి శ్రావణి, సంఘ సభ్యులు శ్రీనివాస్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: నగరంలోని జిల్లా ప్రజా గ్రంథాలయంలో నాయీ బ్రాహ్మణ సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ దుర్గారావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వెంకటరావు, తిలగవతి, పీవీ పద్మనాభం, పి. షణ్ముఖరావు, పి. శిమ్మయ్య, టి, సత్యనారాయణ, త్రినాథ్, బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు, నిత్యావసరాల పంపిణీ



అంధ విద్యార్థినులకు దుస్తులు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

విజయనగరం టౌన్: నగరంలోని సిటీబస్టాండ్ వద్దనున్న అభయాంజనేయస్వామి, కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రీ హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంధ విద్యార్థినులకు దుస్తులు, అలంకార సామగ్రి, నిత్యావసర వస్తువులు గురువారం అందజేశారు. అనంతరం విద్యార్థినులకు భోజనలు సమకూర్చారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులు రవాణా చేస్తే చర్యలు

- సీఐ వెంకటరావు



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న విశాఖ జీఆర్‌పీ లైన్స్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: నిషేధిత వస్తువులను సరఫరా చేసేందుకు సమాయత్తమయ్యే వారం దరిపైనా కఠిన చర్యలు చేపడతామని రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు హెచ్చరించారు. గురువారం స్థానిక రైల్వే స్టేషన్ పోర్టికో వద్దనున్న రైల్వే ఆటో, టాక్సీ స్టాండ్ యూనియన్ నాయకులు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైళ్లల్లో నిషేధిత వస్తువులను తరలించేందుకు వచ్చే వారిపై ప్రత్యేక నిఘా పెట్టి సమాచారం అందించాలన్నారు. అనంతరం అనుమానాస్పద ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



రైతులకు సూచనలు అందిస్తున్న ఏఓ పూర్ణిమ

నెల్లిమర్ల రూరల్: మొక్కజొన్న పంటకు ఆశిస్తున్న కత్తెర పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పూర్ణిమ సూచించారు. మండలంలోని మొయిదలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కత్తెర పురుగు గుడ్లు గమనించిన వెంటనే ఎకరాకు లీటర్ వేప నూనె, 500 ఎంఎల్ క్లోరిపైరిపాస్ పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఈమామేక్టిన్, బెన్జోయెట్ ఎకరాకు 800 గ్రాములు సాయంత్రం వేళలో మొక్క సుడిలో ఆకులు బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అయోధ్య కార్యక్రమంపై ప్రత్యక్ష ప్రసారం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ఈ నెల 22న అయోధ్య రామాలయంలో జరగనున్న బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు స్థానిక గురజాడ కళాభారతిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం సన్నాహక కార్యక్రమాలపై వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, రౌండ్ టేబుల్ ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో జోనల్ ఇన్‌చార్జ్‌లు మేయర్ విజయలక్ష్మి, తమ్మన్నశెట్టి, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఈశ్వర్ కౌశిక్, తదితరులు కోలగట్ల వీరభద్రస్వామి స్వగృమంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ.. కళాభారతిలో పెద్ద పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేశామని, ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ప్రసారం ఉంటుందని, అనంతరం ప్రసాద వితరణ చేపడతామని తెలిపారు.

22న సెలవు ప్రకటించాలి..

విజయనగరం అర్బన్: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో ఆ రోజున సెలవు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ అధ్యక్షుడు కొవ్వాడ శ్రీనివాసరావు , ప్రధాన కార్యదర్శి వీవీజే సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యదర్శి ఇజ్జురోతు రాము నాయుడు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయమై ప్రభుత్వం ఆలోచించాలని కోరారు.

రెండు గ్రామాల్లో డ్రోన్ సర్వే

వేపాడ: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని సోంపు రం, ఆరిగిపాలెం గ్రామాల్లో గురువారం డ్రోన్ సర్వే పూర్తి చేశామని తహసీల్దార్ ప్రసన్నకుమార్ తెలిపా రు. మరో 9 గ్రామాల్లో డ్రోన్ సర్వే చేయనున్నట్లు పేర్కొన్నారు. డ్రోన్ సర్వే పూర్తి కాగానే ఓఆర్ఐ మ్యాప్‌లు వస్తాయని, వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో సమగ్ర భూరీసర్వే చేపడతామని చెప్పారు.శింగరాయి గ్రామంలో ప్రభుత్వ, జిరాయితీ భూములు కలిపి 697.14 ఎకరాలు, సోంపురంలో 1208.87 ఎకరాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. సర్వేలో మండల సర్వేయర్ అప్పలనాయుడు సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: ప్రజల ఆరోగ్య పరిరక్షణను ఉద్దేశించి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తోందని కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు అన్నారు. నగరంలోని దాసన్నపేట వార్డు సచివాలయంలో, పూల్‌బాగ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంలో భాగంగా వలంటీర్లు చేపట్టాల్సిన సర్వే మందుకొడిగా సాగడంపై అసహనం వ్యక్తం చేశారు. పూల్‌బాగ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వలంటీర్ల సర్వే సరిగా చేపట్టకపోవడంతో అడ్మిన్ కార్యదర్శిపై మండిపడ్డారు. అనంతరం ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఉచితంగా అందజేస్తున్న మందుల పంపిణీ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, తొలి దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం కావడంతో రెండో విడత కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మారథాన్



రాజీవ్‌క్రీడా మైదానం నుంచి ప్రారంభమవుతున్న మారథాన్

విజయనగరం: సామాజిక సమతా సంకల్ప మహోత్సవాలలో భాగంగా సెట్విజ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మారథాన్ ఉత్సాహంగా సాగింది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవంలో భాగంగా నగరంలోని రాజీవ్ క్రీడామైదానం వద్ద జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రామానందం మారథాన్‌ను ప్రారంభించారు. మెయిన్‌రోడ్, మూడులాంతర్ల జంక్షన్, కోట జంక్షన్, సింహచలం మేడ జంక్షన్, గంటస్తంభం మీదుగా రాజీవ్ క్రీడామైదానం వద్దకు మారథాన్ చేరుకుంది. కార్యక్రమంలో సెట్విజ్ సిబ్బంది, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అచ్యుత్‌కుమార్, క్రీడాకారులు, యువత, వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఆశపు వేణు, ఎస్‌వీవీ రాజేష్

విజయనగరం: విజయవాడలో 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రూ.400 కోట్లతో (86 అడుగుల బేస్‌మెంట్, 125 అడుగుల విగ్రహం) అంబేడ్కర్ కాంస్య విగ్రహంతో పాటు స్మృతివనాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా నగరంలోని అంబేడ్కర్ కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. అలాగే నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రేగాన రూపాదేవి, దాసరి సత్యవతి, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, బొంగు భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కులగణన

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు కులగణన ప్రక్రియ చేపట్టనున్నామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు కోరారు. ఈ మేరకు అన్ని సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కులగణన ప్రక్రియ విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా శతశాతం కులగణన జరిగే విధంగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కులగణన ప్రక్రియ 19వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఇందులో భాగంగా నగరంలో ఇంటింటి సర్వే చేపట్టే వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కులగణన ప్రక్రియలో పొందుపరిచిన అంశాలకు ప్రజలందరూ తమ వివరాలను అందించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ఏఓ మూర్తి పాల్గొన్నారు.

టీడీపీలో బయటపడిన విభేదాలు

- పూసపాటిరేగలో తెలుగు తమ్ముళ్లది తలోదారి..



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు తమ్మునాయుడు, శంకరరావు, చిన్నంనాయుడు, తదితరులు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు ఈశ్వరరావు, ప్రసాదరావు, సూర్యనారాయణరాజు, తదితరులు

పూసపాటిరేగ: నియోజకవర్గ టీడీపీలో విభేదాలు బయటపడ్డాయి. ఎన్టీఆర్ వర్ధంతిని ఎవరికివారే నిర్వహించుకున్నారు. గురువారం ఉదయం పది గంటల సమయంలో టీడీపీ మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మునాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, తదితరులు మండల కేంద్రంలోని రాజావీధిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో వ్యతిరేక వర్గానికి చెందిన రెల్లివలస సర్పంచ్ భర్త ఇజ్జురోతు ఈశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆకిరి ప్రసాదరావు, కామవరానికి చెందిన టీడీపీ నాయకుడు డి.సూర్యనారాయణరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దురగాసి సూర్యారావు (కనిమెల్ల), తదితరులు ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. గతంలో ఫ్లెక్సీల విషయంలో మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి, అతని వ్యతిరేకవర్గానికి మధ్య రభస జరిగిన విషయం తెలిసిందే. ఇది మరువకముందే తాజాగా తెలుగు తమ్ముళ్లు వేర్వేరుగా ఎన్టీఆర్ వర్ధంతి జరుపుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలి

- ఎంపీడీఓ అప్పలనాయుడు



భోగాపురం: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పలనాయుడు



నెల్లిమర్ల: మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి

భోగాపురం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ సురేష్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై (జీపీడీపీ, టీపీడీపీ) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, పంచాయతీల వారీగా గ్రామసభలు ఏర్పాటు చేసుకుని, అభివృద్ధి పనుల నిర్వహణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి, ఎంఈఓ రమణమూర్తి, ఏపీఓ ఆదిబాబు, ఏపీఎం రమణ, ఏసీడీపీఓ తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

నెల్లిమర్ల: గ్రామాలాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.రామారావు అధ్యక్షతన 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన గ్రామాభివృద్ధిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చి ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యానికి లోటు రానీయకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె.సింహాద్రి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

సౌకర్యాల నడుమ విధులు



నాడు: పెదతాడివాడ పంచాయతీ కార్యాలయ భవనం



నేడు: అధునాతన పెదతాడివాడ సచివాలయ భవనం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి గ్రామాల రూపురేఖలు మారాయి. గతంలో చాలీచాలని వసతులున్న పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు, పంచాయతీ పాలకవర్గాలు కాలం వెళ్లదీసేవి. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంతో పాటు పూర్తి వసతులతో కూడిన ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారు. గతంలో చిన్న భవనంలో పెదతాడివాడ పంచాయతీ కార్యాలయం ఉండేది. విధులు నిర్వహించేందుకు సిబ్బంది ఎన్నో ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం రూ. 40 లక్షలతో అన్ని హంగులతో కూడిన కొత్త కార్యాలయం నిర్మించడంతో అధికారులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – డెంకాడ

నేడు అంబేడ్కర్ కూడలిలో మానవహారం

విజయనగరం అర్బన్: సామాజిక సమతా సంకల్ప మహోత్సవంలో భాగంగా నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడలిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మానవహారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న నేపథ్యంలో చేపట్టనున్న మానవహారాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ ధగధగలు..

విజయనగరం పట్టణం విద్యుత్ కాంతుల ధగధగలతో మెరిసిపోతోంది. ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్, వివిధ అభివృద్ధి పనులకు అమర్చిన రంగురంగుల బల్బులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

